RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 221 పేజీలు - 08 మంగళవారం 07 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ముఖర్జీ సేవలు నిరుపమానం

- దలైలామాతో అనుబంధం గుర్తు చేసుకున్న కిషన్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 6:** శ్యామప్రసాద్ జయంతి, దలైలామా జన్మదినం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. మిగతా2లో...

## ముగ్గురు పిల్లలున్న జంటలకు 5వేల నజరానా

- ఎపి ప్రభుత్వం కీలక ఆదేశాలు

**తొలి అక్షరం/అమరావతి,జూలై 6:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనాభా సమ తుల్యతను కాపాడటం , కుటుంబ సంక్షేమాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఒక వినూత్న నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కువ సంతానాన్ని మిగతా2లో...



## బండి భగీరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

- తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 6:** పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. మిగతా2లో...

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

- ఎకో టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు: పర్యాటకంపై సమీక్షలో సిఎం రేవంత్



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 6:** తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం మిగతా2లో...



## కాళేశ్వరం ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి అసెంబ్లీకి రావాలి: పొంగులేటి

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 6:** కాళేశ్వరం కట్టింది, ఓపెన్ చేసింది బిఆర్ఎసేనని.. కూలింది తమ హయాంలోనే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ కు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే..కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని అన్నారు. మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పై పొంగులేటి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మిగతా2లో...

## బిజెపి కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

- ఘనంగా నివాళి అర్పించిన నేతలు రాంచంద్రరావు, దత్తాత్రేయ
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ రాంచంద్రరావు

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 6:** జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు పార్టీ నాయకులు మిగతా2లో...



# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

- ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ
- గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్
- ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 6:** ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా మిగతా2లో...



## అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారం

దేశానికి బిజెపి క్షమాపణలు చెప్పాలన్న పొన్నం

**తొలి అక్షరం/సిద్దిపేట,జూలై 6:** అయోధ్య విరాళాల చోరీపై బిజెపి దేశానికి క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. జేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుల అవినీతిని గుర్తించి అయోధ్య ప్రజలే ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పందించి.. దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిర విరాళారం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. రాజకీయంగా ఎదగడానికి రాముని పేరును కమలం పార్టీ వాడుకుందని ఆరోపించారు. రాజకీయం వేరు, భక్తి వేరని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రిదే బాధ్యత అని అన్నారు. రాముడి హుండీలోని విరాళాలను ఎత్తుకెళ్లడం దేశ ప్రజలకు అవమానకరమన్నారు. భక్తి పేరుతో, రాముని పేరుతో రాజకీయం చేసే వారి రంగును మిగతా2లో...

# జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

- కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు
- ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు
- టన్నెల్, రిజర్వాయర్లు, కాలువల పనులు సమాంతరంగా పూర్తి
- మూడింతలు పెంచిన సిబ్బంది... ఆధునిక యంత్రాలతో పనులు వేగవంతం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 6:** దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టును జూన్ ?2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. ÷రిళిమవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని మిగతా2లో...

## కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

- లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు
- కాళేశ్వరంపై కెటిఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క



**తొలి అక్షరం/మహబూబాబాద్,జూలై 6 :** కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. మిగతా2లో...

# ముగ్గురు పిల్లలున్న జంటలకు 5వేల నజరానా

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించేలా సరికొత్త నగదు బహుమతులను, ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో మారుతున్న జనాభా రేటు, వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తోంది. నూతన విధానం ప్రకారం? ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలను ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించనుంది. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన మూడు ఉత్తమ జంటలను ఎంపిక చేసి, వారికి రూ. 5,000 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సమక్షంలో ఈ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది. కేవలం సంతానాన్ని పెంచడమే కాకుండా, తల్లి మరియు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఒక కాన్పుకు, మరో కాన్పుకు మధ్య కనీసం రెండేళ్ల కాలం పాటు విరామం పాటించిన దంపతులకు సైతం రూ. 5,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించాలని నిర్ణయించారు. ఇది తల్లుల శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. సరికొత్త విధానాలు , కుటుంబ నియంత్రణ/సంక్షేమ మార్పులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాల కోసం పబ్లిసిటీ బడ్జెట్ కింద రూ. 56 లక్షల నిధులను విడుదల చేసింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరికీ ఈ పథకాలపై స్పష్టత వచ్చేలా సమాచార శాఖ, ఆరోగ్య శాఖలు కలిసి పనిచేయను న్నాయి. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక వారోత్సవాన్ని నిర్వహించనుంది. ఈ నెల 11వ తేదీ నుండి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొని అర్హులైన దంపతులను గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తారు. ఈ ప్రతిపాదనలు భవిష్యత్తులో ఏపీ జనాభా స్థిరీకరణకు, మానవ వనరుల అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించను న్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్‌లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించ నున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు.

# బిజెపి కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొని శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. అఖండ భారత సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు. దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం డ్యాం భద్రతపై జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ మరమ్మతులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా మార్చుకుని భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన రాంచందర్ రావు, ఆ అవినీతి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిపై నామమాత్ర చర్యలతో ప్రభుత్వం చేతులు దులుపుకుందని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు హైడ్రా చర్యలపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను మాత్రమే కూల్చివేస్తున్నారని, అయితే ఎంఐఎంకు చెందిన అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఫాతిమా విద్యాసంస్థలలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులే కోర్టుకు తెలిపారని, హైకోర్టు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఆక్రమణలు జరిగినట్లు అంగీకరించినప్పటికీ అక్రమ నిర్మాణాలను తొలగించకపోవడం వెనుక కాంగ్రెస్, ఎంఐఎం దోస్తీ కారణమని రాంచందర్ రావు ఆరోపించారు. హైడ్రా నిష్పక్షపాతంగా పనిచేసి అందరికీ ఒకే విధమైన న్యాయం చేయాలని, హైకోర్టు ఆదేశాల మేరకు ఎంఐఎంకు చెందిన అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేపడుతుందని రాంచందర్ రావు అన్నారు.

# జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి



(మొదటి పేజీ తరువాయి)

ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఎ÷-లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. న్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్-ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్?2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి' అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు. గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశర చేశారు.

# అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు గుర్తించాలని తెలిపారు. దేవుడి పేరుపై బీజేపీ స్కాం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అయోధ్యలో రామ జన్మభూమి నిర్మాణం జరగాలనీ శిలాన్యాసం రాజీవ్ గాంధీ గారు వేశారు..అయోధ్య ట్రస్ట్ నిర్వాహకులు ప్రధాని మోడీ, అమిత్ షా,ముఖ్యమంత్రి గారికి సన్నిహితులు వారు ఎందుకు స్పందించడం లేదన్నారు. హుండీలు కొల్లగొట్టారు..రాముని పేరు మీద దేశ వ్యాప్తంగా వసూలు చేసిన చందాలు ఎత్తుకొని పోయారు.. ఇక్కడ ప్రతి ఊర్లో అక్షింతలు పంచి ఓట్లు అడిగారు.. మీకు రామునికి వ్యతిరేకం కాదు..మేము శ్రీరాముడి కళ్యాణంలో పాల్గొంటాం..ఇల్లంతకుంట రామాలయంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు ప్రారంభించిన బోజన కార్యక్రమం ఇప్పటికీ నడుస్తుంది..రామాలయం పై బీజేపీ పెద్దలు స్పందించాలి...భక్తి పేరు మీద రాముని పేరు మీద రాజకీయాలు చేసే వారు మాట్లాడాలని పొన్నం అన్నారు. అక్కడ జరిగిన దానిపై పొరపాటు అని దేశ ప్రజలకు క్షమాపణలు అడగాలి..రామ జన్మభూమి అయోధ్య ఆలయంలో సొమ్ములు దొంగిలించడంపై హిందువులు అందరికీ అవమానం..దేవుడి పేరు మీద జరిగిన స్కాం.. దేవుడి స్కాం కి వాడుకున్న పార్టీ బీజేపీ అన్నారు. మజ్లిస్ పేరు తీయంది కిషన్ రెడ్డి బతకడు..కిషన్ రెడ్డి గెలవాలంటే మజ్లిస్ ను తిట్టాలి ఇది వారి రాజకీయాలు అంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఓటరు సవరణ పక్రియ జరుగుతుంది. ఓటరు సవరణ ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైంది..ప్రతి ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాలు చేరాయి.. బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. నేను స్వయంగా ఏడు మండలాలు ప్రత్యక్షంగా తిరిగాను..మా పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం..హైదరాబాద్ ,సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బతిస పై ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగింది..ఓటరు సవరణ పక్రియ విజయవంతంగా జరగాలని అన్నారు.

# ముఖర్జీ సేవలు నిరుపమానం

(మొదటి పేజీ తరువాయి)

ముఖర్జీ సేవలను ఆయన కొనియాడారు. అలాగే దలైలామా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలలని ఆకాంక్షించారు. దలైలామాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మజ్లిస్ పార్టీ అంటే భయమా, ప్రేమా లేక రెండూ ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇందుకోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీ అగ్రనేతల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రభుత్వం ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ సాగిస్తున్న పక్షపాత పాలనకు హైడ్రా చర్యలే ప్రత్యక్ష ఉదాహరణ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# బండి భగీరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

(మొదటి పేజీ తరువాయి)

భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని కోర్టులో పేట్ బషీరాబాద్ పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడిపై బాలిక తల్లి ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశాక ఆరోపణలు తీవ్రంగా ఉండట ంతో అభియోగాలను సవరించినట్లు పోలీసులు చెప్పారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం చేసుకుని, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ప్రభు త్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. బండి భగీరథ్ తండ్రి కేంద్ర మంత్రి కాబట్టి కేసుపై ప్రభావం చూపుతోందని బాధితురాలి తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు దశలో బెయిల్ మం జూరు చేయవద్దని కోరారు. ఇంకా ఈ కేసులో సాక్షులను విచారణ చేయాల్సి ఉందని.. బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులు స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నిరాకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బండి భగీరథ్ జైల్లో ఉన్నప్పుడే కేసు విచారణ పారదర్శకంగా జరుగుతుందని కోర్టులో బాధితురాలి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.

# కాళేశ్వరం ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి అసెంబ్లీకి రావాలి: పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ..కాళేశ్వరం కట్టడానికి బిఆర్ఎస్ ప్రభుత్వానికి రూ.లక్షల కోట్లు వచ్చాయి కానీ పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వడానికి వారికి మనసు రాలేదని పొంగులేటి మండిపడ్డారు. బిఆర్ఎస్ సలహాలు, సూచనలు ఇస్తామంటే అసెంబ్లీ పెడతామని, కాళేశ్వరం ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. బిఆర్ఎస్ చేసిన పాపాలన్నీ చెప్పి అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని, ఇప్పటికైనా అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరంపై వివరణ ఇవ్వాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరకం నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు.

# సర్వీస్ రోడ్లు అస్తవ్యస్తం... ట్రాఫిక్ నియంత్రణ ఎక్కడ? ఫోటోలు తీయడమేనా బాధ్యత?



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 6:** చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతున్నా, సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సర్వీస్ రోడ్లు అనేక చోట్ల దెబ్బతిని, ఆక్రమణలు, అస్తవ్యస్త పార్కింగ్ కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్‌ను నియంత్రించడం, అడ్డంకులను తొలగించడం కంటే కెమెరాలతో ఫోటోలు తీసి చలానాలు విధించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముందుగా ట్రాఫిక్‌కు కారణమవుతున్న సమస్యలను గుర్తించి సర్వీస్ రోడ్లను వినియోగానికి అనుకూలంగా మార్చడం, అక్రమ పార్కింగ్‌ను నియంత్రించడం, ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, చౌటుప్పల్‌లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గిన్నిస్ రికార్డు సాధించిన YBKCI విద్యార్థులకు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి సత్కారం

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కరాటే విద్యార్థులకు శివసేన రెడ్డి ప్రోత్సాహం



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** ఇటీవల గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి తెలంగాణతో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచిన యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ ఇంటర్నేషనల్ YBKCI విద్యార్థులను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ శివసేన రెడ్డి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. YBKCI ప్రతినిధులు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. విద్యార్థుల అసాధారణ ప్రతిభను కొనియాడిన శివసేన రెడ్డి, వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి మెడల్స్ అందజేశారు. కరాటే క్రీడలో ఇంతటి అరుదైన విజయాన్ని సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో సాధన కొనసాగిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని, భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా శ్రమించాలని సూచించారు. YBKCI ప్రతినిధులు తమ విద్యార్థులను ప్రోత్సహించి సత్కరించిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపి, వినయ్, నర్షిక్‌తో పాటు YBKCI గ్రాండ్ మాస్టర్, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్, మాస్టర్ సాయినాథ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతంతోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- గాంధీ భవన్‌లో ఓబీసీ సెల్ జిల్లాల అబ్జర్వర్ల శిక్షణ శిబిరం
- పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో రాష్ట్ర ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాల అబ్జర్వర్ల శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలను గుర్తించి జిల్లా ఓబీసీ సెల్ కార్యవర్గాలు, నియోజకవర్గ ఓబీసీ అధ్యక్షులు మరియు కార్యవర్గాల ఎంపికలో వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలని జిల్లాల పరిశీలకులకు సూచించారు. ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఓబీసీ వర్గాలకు రాజకీయ, సామాజిక రంగాల్లో సముచిత స్థానం కల్పించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ కన్వీనర్లు కేతురి వెంకటేష్, ధనలక్ష్మి, జిల్లాల పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.



# బాబు జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ఇవ్వాలని బీసీ జనసేన, ఎంఆర్పీఎస్ డిమాండ్

## వర్ధంతి సందర్భంగా ఫరూక్‌నగర్‌లో విగ్రహానికి ఘన నివాళులు





**తొలి అక్షరం/ఫరూక్‌నగర్, జూలై 6:** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కరణోద్యమ నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్కు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించాలని బీసీ జనసేన, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. బాబు జగ్జీవన్ రామ్ 41వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఫరూక్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, అసమానతలు లేని సమానత్వ సమాజ నిర్మాణం కోసం బాబు జగ్జీవన్ రామ్ జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ సేవలో నిలిచిన ఆయన, స్వాతంత్ర్యం అనంతరం మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర మంత్రిగా, అనంతరం దేశ ఉప ప్రధానమంత్రిగా సేవలందించి మచ్చలేని ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. దేశ నిర్మాణంలో, సామాజిక న్యాయం సాధనలో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ, జాతీయ బీసీ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహా మాదిగ, జాతీయ బీసీ జనసేన సీనియర్ నాయకుడు వెంకటయ్య టీచర్, రాష్ట్ర సీనియర్ నాయకులు రవి గౌడ్, బొబ్బిలి పాండు మాదిగ, నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డమిది రమేష్ ముదిరాజ్, రాష్ట్ర నాయకుడు మేకల వెంకటేష్, అడ్వకేట్ లింగారం లక్ష్మయ్య, కొత్తూరు మండల అధ్యక్షుడు జెనిగే శ్రీశైలం, శ్రీను, భూషణ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిమాండ్ అనుగుణంగా సాగుకు ఊతమివ్వాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 6:** డిమాండ్ కు అనుగుణంగా రైతులు సాగుకు ఊతమివ్వాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సహకార శాఖ, వైద్య ఆరోగ్యశాఖ లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార శాఖ వారోత్సవాల సందర్భంగా సహకార సంఘాలతో మహిళ సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం మత్స్య పారిశ్రామిక, సాంఘిక కార్యక్రమాలు, జిల్లా కేంద్రం సహకార శాఖ బ్రాంచ్లలో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, రైతులకు నానో యూరియా వాడకం, పై అవగాహన కల్పించాలని, పంట మార్పిడి విధానం ద్వారా ఆయిల్ పామ్, పండ్లు, పూలు, మల్బరీ, నూనె గింజలు, అపరాలు, చిరు ధాన్యాలు, పలు మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు కు ఊతం ఇవ్వాలని, వ్యవసాయ శాఖ, ఉద్యాన & పట్టు పరిశ్రమ శాఖ ల సమన్వయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సెక్రటరీలకు సూచించారు, డ్రోన్ల వాడకం ద్వారా నానో యూరియా స్ప్రే చేయాలని, అందుకోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా, మహిళ సంఘాల ద్వారా డ్రోన్లను కొని రైతులకు సర్వీసులను విస్తృతం అందించాలని తెలిపారు. రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 25 వేల నానో యూరియా సీసాలను విస్తృతం గా రైతులకు అందుబాటు లో ఉంచి, పంపిణీ చేసి,




డ్రోన్లు ను కూడా అందించి నానో యూరియా వాడకాన్ని పెంచాలని అని తెలిపినారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతు సంక్షేమ కార్యక్రమాలు, శిక్షణ కార్యక్రమాలు, నా కార్యక్రమాలు, ఉత్తమ పద్ధతులు, ఆధునిక పద్ధతులు నిత్యం రైతులకు అందించాలని అని తెలిపినారు. ఈ సహకార శాఖ వారోత్సవాల కార్యక్రమాలలో జిల్లా సహకార శాఖ అధికారిని విజయ, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు. మరియన్న, తదితరులు పాల్గొన్నారు, జిల్లాలో చిన్నపిల్లల శిశు ,మరణాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎనిమియా ముక్తుభారత్, (రక్తహీనత) 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల ఆడపిల్లలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని, అందుకోసం అవసరమైన సామాగ్రిని ఏర్పాటు చేసుకోవడం కోసం జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు, మాతా మరణాలు శిశు, మరణాలు



తగ్గించడం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి వారిని గుర్తించి, లోబర్త్ పిల్లలను కూడా గమనిస్తూ ఉండాలని, గర్భవతులు ప్రతి సమయానుకూలంగా అంగన్వాడి కేంద్రాలను సంప్రదిస్తూ వైద్య ఆరోగ్య సూచనల మేరకు పరీక్షలు నిర్వహించుకోవాలని, పోషక ఆహారాలను అందిస్తే లోబర్తు నివారణ కు తోడ్పడుతుందని తెలిపారు, హెచ్పీవీ వ్యాక్సిన్ గర్భసంచి ముఖ ద్వారా క్యాన్సర్ నివారణ కోసం పిల్లలు తల్లిదండ్రుల అనుమతి తీసుకొని వ్యాక్సిన్ వేయాలని, విపిడి పోలియో, టిబి, గోరింత దగ్గు, ధనర్వతం, తదితర వ్యాధులకు వ్యాక్సిన్తో తగ్గించే అంశంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, అన్ని విభాగాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మూగజీవాల పట్ల మృత్యుపాషాలైన కరెంటు తీగలు

- నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ సంఘటన
- సరైన పర్యవేక్షణ లేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్న మూగ జీవాలు
- షాద్‌నగర్ పాత జాతీయ రహదారి (NH-44) వద్ద కరెంటు తీగ తెగిపడి పాడి ఆవు మృతి
- విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారి (NH-44) పక్కన కరెంటు తీగ తెగిపడి ఒక పాడి ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ ప్రాంతం నిత్యం వాహనాలు, పాదచారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే రద్దీ ప్రాంతం కావడంతో, ఈ ఘటన మరింత ఆందోళనకు గురిచేస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, తెగిపోయిన విద్యుత్ తీగ నేలపై పడటంతో అక్కడ సంచరిస్తున్న పాడి ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందనీ. ఈ ఘటనలో మూగజీవం ప్రాణం కోల్పోవడం బాధాకరమని. అదే సమయంలో అక్కడ మనుషులు ఉన్నట్లయితే పెద్ద ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉండేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు పలుమార్లు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ఈ ఘటనకు గల కారణాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ ప్రాంతం నిత్యం వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించే అత్యంత రద్దీ ప్రాంతం. ఇలాంటి ప్రదేశంలో కరెంటు తీగలు తెగిపడి నేలపై పడటం అత్యంత ప్రమాదకరమని స్థానికులు చెబుతున్నారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో మనుషుల ప్రాణనష్టం



జరగలేదు. అయితే అదే సమయంలో అక్కడ జనసంచారం లేదు కాబట్టి సరిపోయింది ఒకవేళ ఎవరైనా ఉంటే పరిస్థితి ఎంత విషాదకరంగా ఉండేదో ఊహించడానికే భయంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే బాధిత రైతుకు తక్షణమే న్యాయమైన పరిహారం అందించాలని, షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారి పరిసరాల్లో ఉన్న విద్యుత్ లైన్లను అత్యవసరంగా పరిశీలించి, పాతబడ్డ తీగలు, స్తంభాలను మార్చి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


# ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూన్ 6:** ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు అత్యంత బాధ్యతగా స్వీకరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, చట్ట నిబంధనల ప్రకారం అర్హులకు తక్షణమే న్యాయం చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాదులు ప్రభలకుండా పాఠశాల ఆవరణలను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు ప్రధానంగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ పథకం, స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీ సమస్యలపై కలెక్టర్కు వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఈ రోజు వచ్చిన కొన్ని దరఖాస్తులలో గార్ల మండలం



సీతంపేట గ్రామానికి చెందిన బి.లాలి తాము నిరుపేదలమని, కూలి పనిచేసి జీవనం సాగిస్తున్నామని, తాము ఇందిరమ్మ జాబితాలో ఎల్.1 లో ఉన్నామని, తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.కేసముద్రం మండల కేంద్రానికి చెందిన మాలోత్ బిక్షం తనకు చెందిన పట్టా భూమిని వేరే ఇతర వ్యక్తులు అక్రమంగా పట్టా చేపించుకున్నారని, అట్టి పట్టాను రద్దు చేసి తన భూమిని తిరిగి ఇప్పించాలని కోరారు.కె.జి.బి.వి, మహబూబాబాద్ లో కుక్ గా పనిచేసిన ఎస్.కె షాహీన్ తనకు 2022 వ సంవత్సరం నుండి జీతం రావట్లేదని తన కుటుంబ ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకుని తనకు తాను ఇప్పటివరకు కుక్ గా పనిచేసిన జీతాన్ని ఇప్పించగలరని కోరారు.గూడూరు మండలం ఎపూరు గ్రామానికి చెందిన



ఈరబోయిన వెంకన్న గ్రామంలోని పాటశాల ఆవరణలో ఉన్న చేతిపంపును పూడ్చివేసి అట్టి స్థలంలో ఇంటినిర్మాననం చేశారని అట్టి నిర్మాణాన్ని తొలగించి చేతి పంపును వాడుకలోకి తీసుకురావాలని, అట్టి అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (225) దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల వారీగా కంప్యూటరైజ్ చేసి, సంబంధిత అధికారులకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. నిర్ణీత కాలవ్యవధిలోగా వీటికి పరిష్కారం చూపి, నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేయాలి**

జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్-12ను ఈనెల 31వరకు చేపట్టి విజయవంతం చేయాలని కలెక్టర్ స్నేహ శబరిష్ సంబందిత అధికారులను ఆదేశించారు. కలెక్ట రేట్‌లో సోమవారం ఆపరేషన్ ముస్కాన్-12పై వివిధ శాఖల అధికారుల తో కలిసి ఆపరేషన్ ముస్కాన్-12 పోస్టర్ ను ఆవిష్కరించారు. తప్పిపోయిన, పారిపోయిన పిల్లలతోపాటు బాలకార్మికులుగా మారిన వారిని సంరక్షించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 31వ తేదీవరకు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్‌లలో పిల్లల మిస్సింగ్‌కు సంబంధించిన సమాచారం తీసుకుని అన్ని విభాగాలు సమన్వయంతో వారిని గుర్తించేందుకు చేర దీసేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ఇటుక బట్టీలు, బేకరీ దుకా ణాలు, మెకానిక్ దుకాణాలు, ఇళ్ల నిర్మాణాల పనులు, వ్యవసాయ పనులతోపాటు ఇతర పనులల్లో బాలకార్మికులతో పనిచేయించుకోవడం నేరమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డి.ఆర్,ఓ నాగలక్ష్మి, ఇంచార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగమణి, సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని విభాగాల అధికారులు,డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### • అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలి: మంత్రి సీతక్క

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జులై 6:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ నీటిపారుదల, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, కొత్తగూడ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై డివిజినల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సుమారు రూ.. 5 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను ప్రారంభించారు, మహిళ స్వయం సహాయక బృందాలకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొన్న బిఎల్ఓ లతో మాట్లాడుతూ ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిమిత్తం వచ్చే సిబ్బంది కోసం ప్రజలు అధికారులు కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ సహకరిస్తూ పూర్తి సమాచారాన్ని అధికారులకు అందించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం వేగంగా కొనసాగుతుందని



జిల్లాలో కలెక్టర్ సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగడం జరుగుతుందని ఆమె అన్నారు.అనంతరం డివిజనల్ స్థాయి అధికారులతో కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధి తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘ సమయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ ఐ ఆర్, యూరియా పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్, పాఠశాలలు, గ్రామపంచాయతీ, అంగన్వాడి, వ్యవసాయ, పశు వైద్య, వివో, హాస్పిటల్, డిగ్రీ కాలేజ్, తదితర ప్రభుత్వ భవనాలు, రోడ్ల మరమ్మత్తులు,ప్రారంభమైన పనులలో వేగం పెంచాలని, అవసరం ఉన్నచోట అధికారులు ప్రతిపాదనలు సమర్పించాలని, ప్రతి ఒక అధికారి నిబద్ధత నిజాయితీగా పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలు అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ముందుకు సాగుతుందని ఇట్టి



లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందని అన్నారు.గంగారం, కొత్తగూడ మండలాలలో యూరియా యాప్ సమస్యలు వస్తూనందున మాన్యువల్ గా ఇవ్వడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, రోడ్లు వంతెనలు చెక్ డ్యాముల అభివృద్ధిలో ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని, గిరిజన, ఎస్సీ, బీసీ ,మైనారిటీ, అన్ని విద్య విభాగాలకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకొని నిత్యం తనిఖీలు చేస్తూ వారికి స్వచ్ఛమైన నాణ్యమైన పక్కా డైట్ మెనూను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్, మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందించాలని, గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రత పాటించే విధంగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, నూతనంగా ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో కూలీల సంఖ్య పెంచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రత్యేక చర్యలు తీసుకొని కేటాయించిన కోట నిర్మాణం పూర్తి చేసి అదనపు ఇండ్ల నిర్మాణం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అడవులను సంరక్షించాలని కోతుల బెడద నుండి ఉపశమనం పొందడం కోసం పండ్ల చెట్లను నాటాలని, స్వయం సహాయక బృందాల మహిళలకు ఆర్థికంగా బలంగా స్థిరపడేందుకు నూతన వ్యాపారాలను ప్రవేశపెట్టాలని వారికి అవగాహన కల్పించాలని సూచించారు, ఇప్పటికే పెట్రోల్ పంపులు, బస్సులు, ఇప్పపువ్వు లడ్డు తయారీ, తదితర అన్ని కార్యక్రమాలను చేరువ చేయడం జరిగిందని, అందుకోసం అధికారులు వారిని చైతన్యపరచాలని సూచించారు.గృహ జ్యోతి పథకం కింద ఇప్పటికే జీరో విద్యుత్ బిల్లు కింద సుమారు నాలుగు కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని, ఇరిగేషన్ శాఖ ద్వారా చెక్ డాములు కాలువలు చెరువుల అభివృద్ధి పనులు చేయాలని రానున్న వర్షాకాలం నేపథ్యంలో నీటి వనరులను పెంపొందించడం కోసం కృషి చేయాలని అన్నారు, గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అన్ని పనులను వేగంగా కొనసాగించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.అనంతరం అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రోసిడింగ్ కాపీలను అందజేశారు.ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో , మాట్లాడుతూ అటవీ ప్రాంతం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అన్ని విభాగాల వారు స్థానికంగా ఉంటూ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిపిఓ హరిప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, ఆర్డీఓ రాజేశ్వరి, కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధి అధికారులు, వైష్ణవి, అనురాధ, తహసిల్దార్లు బాలకిషన్, రాజు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థుల పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** "స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్" (మిషన్ హరితోదయం) కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య పాఠశాల, షాద్‌నగర్ విద్యార్థులు పట్టణంలో ఘనంగా పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ,నీటి సంరక్షణ,ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండడం, పరిశుభ్రమైన పరిసరాలను కాపాడడం,అధిక సంఖ్యలో మొక్కలు నాటడం వంటి సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ఫరూఖ్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మనోహర్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు.విద్యార్థులు సామాజిక బాధ్యతతో పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందిస్తూ, చిన్నారుల్లో పర్యావరణ విలువలను పెంపొందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీధర్,శ్రీవిద్య,ప్రిన్సిపాల్ ఆనంద్,డీన్ డాక్టర్ సైదులు,ఇన్‌చార్జ్ శ్రీ చారి, ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు.

# షాద్‌నగర్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌కు కాంగ్రెస్ నేతల ఘన నివాళి

### జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం.. వర్ధంతి సందర్భంగా నేతల నివాళులు

### దళిత సాధికారతకు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివి కాంగ్రెస్ నేతలు

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, ప్రముఖ దళిత నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 41వ వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు జాంగారి రవి ఆధ్వర్యంలో బ్లాక్ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం మాట్లాడుతూ, ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో నాలుగు దశాబ్దాలకు పైగా పార్లమెంట్ సభ్యుడిగా, కార్మిక, రక్షణ, వ్యవసాయ శాఖల మంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించిన మహానేత డాక్టర్ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. చైనా, పాకిస్థాన్ యుద్ధాల సమయంలో రక్షణ శాఖ మంత్రిగా దేశ భద్రతను బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి. వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ,





దేశ తొలి కార్మిక శాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా ఆహార భద్రత కోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటులో డాక్టర్ జగ్జీవన్ రామ్ విశేష కృషి చేశారని అన్నారు.కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాధేపల్లి సిద్ధార్థ మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పిస్తే, ఆ హక్కులు అమలయ్యేలా పార్లమెంట్‌లో పోరాడిన నాయకుడు డాక్టర్ జగ్జీవన్ రామ్ అని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు కరోళ్ళ సురేందర్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, దళితుల సాధికారత, రిజర్వేషన్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు జాంగారి రవి మాట్లాడుతూ, దళిత, బహుజనుల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప ప్రజానాయకుడు డాక్టర్ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం, మాజీ జెడ్పీటీసీ పి. వెంకట్ రాంరెడ్డి, బాధేపల్లి సిద్ధార్థ, కరోళ్ళ సురేందర్, తుపాకుల శేఖర్ ముదిరాజ్, సర్పంచ్ రమేష్, వావిలాల సుజీవన్, జాంగారి జంగయ్య, రవితేజ, బొరిగె నరేందర్, త్రిప్పిశెట్టి కర్ణకర్, పోలే శ్రీహరి, సింగపగ జంగయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, జేఏసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడు తండాలో శీతల భవాని విగ్రహ ప్రతిష్టాపన

**- పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, నెక్కొండ మండలం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ తిరుమల్ చౌహాన్.**





**తొలిఅక్షరం/నెక్కొండ జూలై 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని మూడు తండా గ్రామపంచాయతీ సర్పంచ్ బోడ బాలు అధ్యక్షతన జరిగిన శీత్లా భవాని విగ్రహ ప్రతిష్టాపనకు ముఖ్య అతిథులుగా హాజరై బంజారా సోదరి సోదరీమణులకు మరియు స్థల మరియు విగ్రహ దాత బోడ కౌసల్య -శంకర్ నాయక్ లకు శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ , మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల చౌహాన్, రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ , బంజరపల్లి సర్పంచ్ నెక్కొండ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్ , ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిబీరు కమల్ మరియు తండా వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# "నా ఓటు నా హక్కు".. ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలి

**18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి**


**గిరాయగుట్ట తండా గ్రామ సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్**

**ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అవసరం**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఫరూక్నగర్ మండలం గిరాయగుట్ట తండా గ్రామ సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) రాజుతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహణ, ఓటర్ల వివరాల నమోదు, మార్పులుచేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా ఎంతో కీలకమని పేర్కొన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించడం ప్రతి పౌరుడి హక్కుతో పాటు బాధ్యత కూడా అని అన్నారు. ప్రజలకు అవసరమైన డిజిటల్, ఫిజికల్ సేవలను అందించేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలోని ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరుగా నమోదు అయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ రాజు, మాజీ వార్డు సభ్యుడు బాలు, గ్రామ యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట నూతన ఎస్సైగా సతీష్ గోపాతి



**తొలి అక్షరం/రామన్నపేట జులై 6:** రామన్నపేట మండల నూతన ఎస్సైగా సతీష్ గోపాతి సోమవారం రోజున బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం పత్రిక సమావేశంలో మాట్లాడుతూ గతంలో నల్గొండ సిసిఎస్ లో విధులు నిర్వహించినట్లు. లా అండ్ ఆర్డర్స్ కి మొదటి ప్రాధాన్యతతో పాటు. మండల వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడుతానని తెలిపినారు

# బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నివాళులు



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 6:** భారత మాజీ ఉప ప్రధాని, దళితుల మహానేత డా. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో రహదారి బంగ్లా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మహమ్మద్ జమీరుద్దీన్, డా. బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి, సమాజంలోని అణగారిన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నాసర్, బొడ్డు సాలయ్య, బండ అంజిరెడ్డి, బొడ్డు శంకరయ్య, మహమ్మద్ అక్రమ్, మహమ్మద్ రిజ్వాన్, కేశవదాసు, ఉదయ్, మహమ్మద్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి వేడుకలు

**- ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య**



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన్ లో డా: బాబు జగ్జీవన్ రామ్ 40వ,వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించు కోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆ మహానుభావుడిని స్మరించుకుంటూ ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య మాట్లాడుతూ. రాజకీయాల్లో 50 ఏళ్లు పదవుల్లో రికార్డులు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంబేద్కర్ సమానులు. కార్మికుల హక్కుల కోసం, దళిత అణగారిన వర్గాల అభివృద్ధి కోసం. రైతుల సంక్షేమం కోసం. దేశ ఆర్థిక అభివృద్ధి కోసం.. చివరి శ్వాస వరకు పనిచేసిన గొప్ప నాయకుడు.. దళిత జాతి ఆరాధ్య దైవమైన జగ్జీవన్ రామ్ అడుగుజాడలో అణగారిన వర్గాలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అందరు కలిసి కట్టుగా ఉండి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, ఎదగాలని దళితుల హక్కులను రాజ్యాంగంలో డా బిఆర్ అంబేద్కర్ పొందుపరిస్తే వాటిని చట్ట రూపంలో అమలు చేయడానికి చేసిన కృషి మరపురానిది అని కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు దళితరత్న వడ్డూరి కుమార్. మాజీ ఎంపిటిసి ఈదునూరి ప్రభాకర్,దళిత కవి మందుల పరమాత్మ, మండల సీనియర్ నాయకులు జన్ను రవి, కందిక అశోక్, మంద సురేష్, ఈదునూరి వినయ్, ఎర్ర ప్రభాకర్, పెయింటర్ యూనియన్ మండల అధ్యక్షులు ఈదునూరి అనిల్,ఆకులపల్లి నరేష్, ఈదునూరు సురేష్, క్రాంతి, మనుబోతుల ఉప్పలయ్య పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట జులై 6:** అఖండ భారత స్వప్నసాకారుడు, దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయులు భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళు లు. బిజెపి మండల ప్రధాన కార్యదర్శి జంగిల్ సత్యనారాయణ యాదవ్. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గు మండల కేంద్రంలో సియంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కులు**

**స్థానిక నాయకుల చేత లబ్ది దారులకు అందింప చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**తొలి అక్షరం/కొందుర్గు, జులై 06:** కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన మన్మారి సురేందర్,సోమారంపహాడ్ గ్రామానికి చెందిన బోల యాదయ్యలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సియంఆర్ఎఫ్ చెక్కులను కొందుర్గు మండల కేంద్రంలో లబ్ధిదారులకు స్థానిక నాయకుల చేత అందింపచేశారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్,మాజీ జడ్పిటిసి తనయుడు రామకృష్ణ,మాజీ పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి,ఉమేంత్యాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి,మహదేవ్ పూర్ సర్పంచ్ అనూషరవీందర్ రెడ్డి,విశ్వనాధ్పూర్ సర్పంచ్ శ్రీలత రాములు,గుంజల్ పహాడ్ సర్పంచ్ వెంకటేష్,మాజీ సర్పంచ్ ప్రేమ్ కుమార్,గోపాల్ నాయక్,నర్సిములు, నాయకులు దర్గారామచేంద్రయ్య, ఎ.యాదయ్య, డిప్యూటీ సర్పంచ్ రాజు,ఉదయ్ భాను, భాగాలరాములు,చిట్యల రవీందర్,కబీర్ శ్రీకాంత్,కబీర్ క్రిష్ణ,పిట్ట శేఖర్ యాదయ్య, సి.సతి రెడ్డి బోయ ప్రశాంత్ లతీఫ్ వెంకటయ్య,డిప్యూటీ సర్పంచ్ రాజు పామిడి నగేష్,పామిడి రమేష్,టేకులపల్లి బుడోని నర్సింలు పద్మారామ్ క్రిష్ణయ్య,బాలకిషయ్య పాల్గొన్నారు.

# సరియైన పత్రాలు లేకపోతే కేసులు నమోదు, భారీ రుసుమ ఖాయం: జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, జూలై 6:** సరైన పత్రాలు లేకపోతే కేసు నమోదు, భారీ రుసుమ తప్పదని జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలో వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు జిల్లా రవాణా అధికారి (డీటీఓ) శంకర్ నాయక్ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను వెంట ఉంచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన సుమారు 7 వేల ఆటోరిక్షాల యజమానులు తమ వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పీయూసీ (గ్రాఖజ) సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. తనిఖీల సమయంలో ఈ పత్రాలు లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కమర్షియల్ వాహనాల యజమానులు త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించాలని, పన్ను బకాయిలు ఉన్న వాహనాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తామని జిల్లా రవాణా అధికారి హెచ్చరించారు. వ్యవసాయ అవసరాల కోసం రిజిస్ట్రేషన్ పొందిన ట్రాక్టర్లను కమర్షియల్ పనులకు వినియోగించరాదని హెచ్చరించారు. కమర్షియల్ వినియోగానికి నమోదైన ట్రాక్టర్ట్రైలర్లకు ప్రతి మూడు నెలలకు త్రైమాసిక పన్ను చెల్లించడంతో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కంప్రెసర్లు, రోటావేటర్లు అమర్చిన ట్రాక్టర్లకు కూడా త్రైమాసిక పన్ను, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే స్కూల్ బస్సుల యజమానులు ప్రతి మూడు నెలలకు త్రైమాసిక పన్ను చెల్లించి, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్ పత్రాలను ఎప్పటికప్పుడు చెల్లుబాటులో ఉంచాలని సూచించారు. కొత్తగా కొనుగోలు చేసిన ప్రతి వాహనాన్ని టీఆర్ (తాత్కాలిక రిజిస్ట్రేషన్) గడువు ముగియకముందే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా రవాణా అధికారి తెలిపారు. వాహన పన్నులను సమీపంలోని మీ



సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సేవలు లేదా మొబైల్ ఫోన్ ద్వారా సకాలంలో చెల్లించుకోవచ్చని వివరించారు. ఆర్‌టీఏ అధికారులు నిర్వహించే తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధిస్తామని శంకర్ నాయక్ హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులకు, ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలందరూ తమ వాహ నాలకు సంబంధించిన పత్రాలు, పన్నుల రసీదులు ఎప్పటి కప్పుడు సక్రమంగా ఉంచుకుని, కమర్షియల్ వాహనాల త్రైమాసిక పన్ను లను గడువులోపు చెల్లించి, రవాణా శాఖ నిబంధనలను పాటిం చాలని జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

# బోగారం చేనేత సహకార సంఘం ఎన్నికల గుర్తులు కేటాయింపు




**తొలి అక్షరం/రామన్నపేట జులై 6:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామ చేనేత సహకార సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల అధికారి అంజయ్య పోటీ చేస్తున్న అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులను అధికారికంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అడ్వైజర్ కమిటీ అధ్యక్షులు కోడి పాండునాథ్ మిశ్రమ చేనేత సహకార సంఘం కార్మికులు ఇతర సభ్యులు పాల్గొన్నారు

# జీవితాంతం పోరాడిన మహానేత బాబు జగ్జీవన్ రామ్

**తొలి అక్షరం/రామన్నపేట జులై 6:** బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి – దైద రవీందర్సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానేత, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి ఘనంగా పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూబాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వం పట్ల వారి అంకితభావం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అనిసామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుదాం అని తెలిపినదైద రవీందర్ – తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల సైదులు , ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల సుదర్శన్ , యూత్ కాంగ్రెస్



నాయకులు చెనగాని రాజశేఖర్ గౌడ్ , వంటెపాక నక్షత్ , చెరుపల్లి సైదులు , నాగరాజు , వెంకటేష్ , పందిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు

# సూరారం గ్రామం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



**తొలి అక్షరం/రామన్నపేట జులై 6:** రామన్నపేట మండలం సూరారం గ్రామం. గో టు విలేజ్ కార్యక్రమాల్లో భాగంగా నిన్న సూరారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ, మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి మాదిగ, జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మరియు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. నూతనఅధ్యక్షులుగా బందెల నరేష్,ఉపాధ్యక్షులుగా బూడిద నరసింహ, బందెల కృష్ణ.ప్రధాన కార్యదర్శిగా బందెల సైదులు, కార్యదర్శి గా బందెల మహేష్, సహాయ కార్యదర్శి బందెల నాగరాజు,సాంస్కృతిక కార్యదర్శి బందెల మల్లేష్, ప్రచార కార్యదర్శి బందెల చిన్న మహేష్, సలహాదారులుగా బందెల నరసింహ, బందెల వెంకన్న, బందెల ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఎస్ఐఆర్‌కు పూర్తి స్థాయిలో సహకరించాలి

**● షాద్‌నగర్ ఆర్డీఓ ఎన్ఆర్ సరిత ● ఎస్ఐఆర్‌లో షాద్‌నగర్ అగ్రస్థానం.. ● 95 శాతం ఎటీన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి**

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియలో షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచిందని షాద్‌నగర్ ఆర్డీఓ ఎన్ఆర్ సరిత తెలిపారు. ఫరూక్ నగర్ మండలం అన్నారం గ్రామంలో ఆమె మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఆమె ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని ఈ సందర్భంగా వివరించారు.నియోజకవర్గంలోని మొత్తం 2,44,426 మంది ఓటర్లకు పంపిణీ చేయాల్సిన ఎన్యుమరేషన్ ఫారాల్లో 2,09,130 ఫారాలు పంపిణీ చేయగా, ఆదివారం నాటికి 95 శాతం పంపిణీ పూర్తయిందని తెలిపారు. శనివారం నాటికి పూర్తయిన వివరాల ప్రకారం 5,962 ఫారాలను డిజిటైజ్ చేయగా, అది 2.44 శాతంగా నమోదైనట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి గణాంకాల ప్రకారం రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85.56 శాతం



ఫారాల పంపిణీతో షాద్‌నగర్ మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం కల్వకుర్తి (83.46%), చేవెళ్ల (82.24%) స్థానాల్లో ఉన్నాయని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 36,99,743 మంది ఓటర్లలో 23,41,314 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, జిల్లా సగటు 63.28 శాతంగా నమోదైందన్నారు. జిల్లా వ్యాప్తంగా డిజిటైజేషన్ 1.19 శాతం మాత్రమే ఉండగా, షాద్‌నగర్ నియోజకవర్గం ఈ విషయంలో కూడా ముందంజలో ఉందని తెలిపారు. మండలాల వారీగా పరిశీలిస్తే జిల్లేడు చౌదర్‌గూడ మండలం 95.99 శాతంతో తొలి స్థానంలో నిలవగా, కేశంపేట 95.19 శాతం, కొందుర్గు 94.52 శాతం, నందిగామ 87.61 శాతం, ఫరూఖ్‌నగర్ రూరల్ 85.12 శాతం, కొత్తూర్ 84.28 శాతం ఫారాల పంపిణీ పూర్తి చేశాయని వివరించారు. అయితే షాద్‌నగర్ మున్సిపాలిటీలో 70.08 శాతం మాత్రమే పంపిణీ పూర్తికావడంతో మిగతా ప్రాంతాలతో పోలిస్తే కొంత వెనుకబడి ఉందన్నారు. డిజిటైజేషన్ పరంగా ఫరూఖ్‌నగర్ రూరల్‌లో 1,621, కేశంపేటలో 1,374, షాద్‌నగర్ మున్సిపాలిటీలో 1,052, కొత్తూరులో 1,006 ఫారాలను డిజిటైజ్ చేసినట్లు తెలిపారు.మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్డీఓ సరిత తెలిపారు. పూర్తి స్థాయిలో ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పనులు మరింత వేగంగా కొనసాగనున్నాయని ఆమె పేర్కొన్నారు.

# శంషాబాద్ కూరగాయల మార్కెట్(బి) సెక్షన్ నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షుడిగా ఎన్నికైన చలివేంద్ర కృష్ణారెడ్డి**



**తొలి అక్షరం/శంషాబాద్, జులై 06:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పట్టణంలోని కూరగాయల మార్కెట్ (బి) సెక్షన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం రోజున మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చలివేంద్ర కృష్ణారెడ్డి,ఉపాధ్యక్షుడుగా మెరుగు కుమార్,ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ రెడ్డి.అదనపు కార్యదర్శిగా ఆర్.రంగారెడ్డి.కోశాధికారిగా మల్చలం సురేష్,ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు మార్కెట్ ఓనర్స్ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మార్కెట్ ఓనర్స్ అసోసియేషన్ తరపున సమస్యల పరిష్కారానికి ముందుండి తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని, మార్కెట్ కు తమ పండించిన పంటలను తీసుకొచ్చే రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా, రైతులు తీసుకువచ్చే కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించి తూకంలో ఎలాంటి మోసాలకు తావు లేకుండా చూస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# పునీత ఆంటోనీ చర్చి వార్షికోత్సవానికి ఏర్పాట్లు..



**● మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పరిశుభ్రత పనులు**

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** షాద్‌నగర్ పట్టణంలోని మరియరాణి పాఠశాల ఆవరణలో ఉన్న పునీత ఆంటోనీ చర్చిలో వచ్చే ఆదివారం జరగనున్న వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపాలిటీ డోజర్ సహాయంతో చర్చి పరిసరాలను శుభ్రం చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ పరిశుభ్రత పనులను షాద్‌నగర్ క్రిస్టియన్ మైనార్టీ ఇన్‌చార్జి రవితేజ, పునీత ఆంటోనీ చర్చి కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి, బాలు తదితరులు దగ్గరుండి పర్యవేక్షించారు. వార్షికోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# వేములను ఆశీర్వదించిన మంత్రులు



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 6:** ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని తన నూతన విప్ ఛాంబర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్ , బల్మూరి వెంకట్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తదితరులు హాజరై వేముల వీరేశం కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# రామన్నపేటకు ఉత్తమ సేవలు అందించిన ఎస్సై డి. నాగరాజు

**తొలి అక్షరం/రామన్నపేట జులై 6:** రామన్నపేట మండలానికి ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి సోమవారం రోజున బదిలీపై బోనగిరి జిల్లా కేంద్రానికి వెళ్లిన ఎస్సై డి .నాగరాజు రామన్నపేట మండలానికి ఉత్తమ సేవలు అందించారు. ఆయన జిల్లా స్థాయి అధికారులు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఆదేశాలను తూచా తప్పకుండా శాంతి భద్రతలను కాపాడుతూ రామన్నపేట మండల ప్రజల మనసును గెలుచుకున్నారు. ఆయన బదిలీపై వెళుతుంటే తనతో పని చేసిన సిబ్బంది మండల ప్రజలు ఆయనను ఘనంగా సన్మానించినారు. రామన్నపేట మండల వ్యాప్తంగా ఎస్సై డి నాగరాజు అంటే ప్రతి ఒక్క వ్యక్తికి మంచి గౌరవం ఉంటుంది. ముఖ్యంగా ఆయన మండల వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడడంలో ముందు వరుసలో ఉన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామపంచాయతీ ఎలక్షన్స్ లో ఏ గ్రామంలో కూడా చిన్న డిస్టబెన్స్ లేకుండా అన్ని రకాల పార్టీ నాయకులతో చర్చించి ప్రజాసంఘాలతో చర్చించి ప్రతి గ్రామంలో శాంతిభద్రతలను కాపాడుతూ ఎలక్షన్స్ నిర్వహించడంలో కీలకపాత్ర పోషించినారు. లక్ష్మాపురం గ్రామంలో అదుపుతప్పి ఏటిలో పడిన వ్యక్తిని అన్ని రకాల డిపార్ట్మెంట్స్ సహకారంతో ఆ యొక్క వ్యక్తి ప్రాణాలు పోకుండా నిద్ర లేకుండా అక్కడే డ్యూటీ చేస్తూ గ్రామ ప్రజలకు ధైర్యం చెప్పి 12 గంటలు పర్యవేక్షణ చేసి అతని ప్రాణాలు కాపాడినారు. మండలంలో మంత్రి పర్యటనకు ప్రభుత్వ విప్ పర్యటనకు వారి వారి యొక్క భద్రతల విషయంలో తన తోటి సిబ్బంది సహకారంతో మంచి భద్రత అందించినారు. రామన్నపేట మండలానికి 9 మంది హైకోర్టు జడ్జిలు వస్తే తన తోటి సిబ్బందితో పై అధికారుల ఆదేశాలతో వారికి ప్రతిష్టమైన భద్రత అందించినారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి సంక్షేమ పథకాలు అధికారుల ద్వారా లబ్ధిదారులకు అందే విధంగా గ్రామసభలలో ద్వారా అధికారులకు ప్రత్యేక



భద్రత కల్పించినారు. రామన్నపేట మండల వ్యాప్తంగా యువత మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా విద్యార్థులకు గ్రామ గ్రామాన తల్లిదండ్రుల సహకారంతో గ్రామ పెద్దల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ముందు వరుసలో ఉన్నారు. మండల వ్యాప్తంగా ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తన భద్రత సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు పై అధికారుల సహకారంతో మండల వ్యాప్తంగా గ్రామ గ్రామంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ముందు వరుసలో ఉన్నారు. రామన్నపేట మండల వ్యాప్తంగా రైతుల యొక్క సమస్యలు తెలుసుకుని అధికారుల ద్వారా రైతులకు న్యాయం జరిగే విధంగా చూడడంలో ముందు వరుసలో ఉన్నారు. ప్రతిరోజు మండల వ్యాప్తంగా తన సిబ్బంది సహకారంతో గ్రామ గ్రామంలో పెట్రోలింగ్ వెహికల్ నడిపించడంలో ముందు వరుసలో ఉన్నారు. ఏది ఏమైనా రామన్నపేట మండల కి ఒక ఎస్సైగా డి నాగరాజు ఉత్తమ సేవలు అందించినారు. అధికారులకు బదిలీలు సాధారణమే కానీ ప్రజల మనసు గెలుచుకోవడం మాత్రం చాలా గొప్ప విషయం రానున్న రోజుల్లో ఎస్సై డి.నాగరాజు ఉన్నత పదవుల్లో ఉండాలని రామన్నపేట మండల ప్రజలు ఆశీర్వదించినారు.

# ఆపదలో అండగా గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘం

**మృతి చెందిన స్వర్ణకార కుటుంబాలకు నిరంతర చేయూత విద్య, ఆర్థిక సహాయంతో భరోసా**

**అనాథ పిల్లల చదువుకు రెండేళ్లుగా విద్యా సామగ్రి అందజేత**

**ప్రతి బాధిత కుటుంబానికి సంఘం తరపున ఆర్థిక సహాయం**

**విద్య, వైద్యం, అత్యవసర వేళల్లో అండగా నిలుస్తాం: కట్టా రాజేందర్**

**సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని సంఘం హామీ**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూన్ 6:** వరంగల్,సమాజ సేవను ధ్యేయంగా తీసుకుని ఆపదలో ఉన్న స్వర్ణకార కుటుంబాలకు అండగా నిలుస్తున్న గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘం సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తోందని సంఘం ప్రధాన కార్యదర్శి కట్టా రాజేందర్ తెలిపారు. మృతి చెందిన స్వర్ణకార కుటుంబాలను ఆదుకోవడం సంఘం ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన స్వర్ణకారుడు రాజు కుటుంబాన్ని సంఘం ప్రతినిధులు పరామర్శించారు. వారి పిల్లల విద్యాభ్యాసానికి గత రెండేళ్లుగా పుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ అండగా నిలుస్తున్నారు. అలాగే, మృతి చెందిన ప్రతి స్వర్ణకార కుటుంబానికి సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ చిన్నారి చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో విద్యా సహాయ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని కట్టా రాజేందర్ తెలిపారు. అవసరమైన కుటుంబాల వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే, సంఘం తరపున సాధ్యమైనంత మేర సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. "పదవిలో ఉన్నంతకాలం సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతాం. ఆపదలో ఉన్న ప్రతి స్వర్ణకార కుటుంబానికి సంఘం అండగా ఉంటుంది. విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో మా వంతు సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం" అని కట్టా రాజేందర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరి చంద్రసేన, ఉపాధ్యక్షులు కట్కోజ్వల శ్రీనివాసాచారి, శ్రీరామోజు రాజు, గౌరవ సలహాదారులు తంగళ్ళపల్లి మోహనాచారి, శ్రీరామోజు శ్యాంప్రసాద్, అలాగే శివ, ప్రతాప్, సతీష్, శ్రీకాంత్, లింగమూర్తి, ఉల్లి వినిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి



**తొలి అక్షరం/మహాదేవాపూర్ జూలై 6:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాదేవాపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో ప్రభుత్వ గృహ పథకాల అమలు పురోగతిని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, హౌసింగ్ స్కీమ్ సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ శ్రీ ఈశ్వరయ్య సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించిన ఆయన, గ్రామంలోని అన్ని పూరి గుడిసెలకు సంబంధించిన సమగ్ర సర్వేతో పాటు రూఫ్ రీప్లేస్‌మెంట్ సర్వేను అత్యవసరంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ లోకి లాల్ ,డిప్యూటీ ఇంజనీర్ శ్రీకాంత్ ,అసిస్టెంట్ ఇంజనీర్లు సాయి సందీప్, రాజలింగం, గ్రామ పంచాయతీ కార్యదర్శి డి. శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు

# ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**17వ వార్డు కౌన్సెలర్ నాజియా బేగం**

**షాద్ నగర్ మున్సిపాలిటీ 17 వ వార్డులో ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారం ల పంపిణి**




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం లో భాగంగా షాద్ నగర్ మున్సిపాలిటీ 17 వ వార్డు లో కౌన్సెలర్ నాజియా బేగం ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో ప్రజలు భాగస్వాములు కావాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ప్రారంభించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని కలుసుకుని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తూ, వాటి వినియోగంపై మరియు ఎన్యూమరేషన్ పారం రాయాల్సిన విధానాని తెలిపి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సెలర్ నాజియా బేగం మాట్లాడుతూ 17 వ వార్డులో ప్రతి అర్హుడైన ఓటరు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. పేరు, చిరునామా, వయస్సు, కుటుంబ వివరాలు ఇతర వ్యక్తిగత సమాచారం తప్పుగా నమోదై ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో పాటు ఫారాలను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా సవరణలు చేపట్టడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించి, అందజేసిన ఫారాలను సకాలంలో సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాలనీవాసులు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన వ్యక్తం చేస్తూ, అధికారులు ఇంటింటికీ వచ్చి వివరాలు తెలియజేయడం పట్ల ఓటరు నమోదు ప్రక్రియపై స్పష్టత వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా మాజీ ఎంపిపి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- హాజరైన షాద్ నగర్ ప్రముఖులు**




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 06:** షాద్ నగర్ సీనియర్ కాంగ్రెస్ నేత, ఫరూక్ నగర్ మాజీ ఎంపీపి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. షాద్ నగర్ పట్నంలోని న్యూ సిటీ కాలనీలో ఆయన స్వగృహంలో జరిగిన జన్మదిన వేడుకలలో నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు మొదటగా కేక్ కట్ చేయగా ఆ తర్వాత ఆయన అభిమానులు మిత్రులు శ్రేయోభిలాషులు స్నేహితులు పెద్ద ఎత్తున వేడుకలకు హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కేపీ, జర్నలిస్టులు శరత్, లక్కాకుల రమేష్ కుమార్, శివ కుమార్, టీజీ ఆర్ఎస్ఏ రాష్ట్ర నాయకులు ఎం. వెంకటరెడ్డి, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేతలు విశ్వనాథం, మనోహర్ రెడ్డి, దేవి గ్రాండ్ అధినేత దయాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ అశోక్, రివాల్వర్ శేఖర్, సీతారాం, ముబారక్ అలీ ఖాన్, సీతారాములు, శారద నెహ్రూ, దర్శన్, అశోక్,, జర్నలిస్టు శివకుమార్, సుదర్శన్, తులసిరామ్ అదేవిధంగా ప్రముఖులు న్యాయవాది గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# నేర నియంత్రణకు మూడో కన్ను





**- ఉప్పల్‌లో 93 సీసీ కెమెరాల ప్రారంభం**

**- నేను సైతం 2.0,మీ సురక్ష'పై ప్రజలకు అవగాహన**

**- కాలనీ అసోసియేషన్ల భాగస్వామ్యంతో భద్రత పటిష్టం**

**- ఉప్పల్ ఎస్హెచ్ఓ రామలింగ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరణ**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూలై 6:** నగరంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, సాంకేతికతను జోడించి నేరాల నియంత్రణకు ఉప్పల్ పోలీస్ యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేను సైతం 2.0 కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ పరిధిలో ఒకేరోజు రెండు చోట్ల కలిపి మొత్తం 93 నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అందుబాటులోకి తెచ్చారు. ఉప్పల్ భగాయత్‌లోని వాసవి మెట్రో పోలీస్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సమన్వయంతో అంతర్గత భద్రతకై ఏర్పాటు చేసిన 73 సీసీ కెమెరాలను ఉప్పల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్థానిక ప్రతినిధులతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. దీంతో పాటు సౌత్ స్వరూప్ నగర్ పరిధిలో ప్రజా భద్రత నిమిత్తం అమర్చిన మరో 20 సీసీ కెమెరాలను కూడా ఆయన ఆవిష్కరించారు.

**భద్రతపై విస్తృత అవగాహన:**

కెమెరాల ప్రారంభోత్సవం అనంతరం వాసవి మెట్రో పోలీస్ అపార్ట్‌మెంట్ నివాసితులతో కలిసి 'నేను సైతం 2.0' మరియు 'మీ సురక్ష' అంశాలపై పోలీస్ శాఖ ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించింది. ఆధునిక కాలంలో నిఘా నేత్రాల ప్రాముఖ్యతను, సైబర్ భద్రతతో పాటు స్థానిక భద్రతా నియమాలను ప్రజలకు వివరించారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజం:**


నేరాల నివారణలోనూ, జరిగిన నేరాలను ఛేదించడంలోనూ సీసీ కెమెరాలు నిరుపమానమైన పాత్ర పోషిస్తున్నాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం అభినందనీయం. ప్రతి ఒక్కరూ భద్రతా ప్రాధాన్యత లను గుర్తించి, 'మీ సురక్ష' నిబంధనలను పాటించాలి.

**-ఇన్‌స్పెక్టర్ రామలింగ రెడ్డి, ఉప్పల్ పోలీస్ స్టేషన్**

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ నిఘా వ్యవస్థ ద్వారా స్థానికంగా భద్రత మరింత మెరుగవుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు,కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నివాసితులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నారాయణపురం నూతన ఎస్సైగా సీత పాండు

- బాధ్యతలు స్వీకరించిన సబ్‌ఇన్‌స్పెక్టర్
- చట్టం ముందు అందరూ సమానమే
- నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),జూలై6:** సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా సీత పాండు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానమేనని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని ఎస్సై స్పష్టం చేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తాము ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. **ప్రజా పోలీసింగ్‌కే మా ప్రాధాన్యం:** ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించవచ్చని ఎస్సై సీత పాండు భరోసా ఇచ్చారు. తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ 'ప్రజా పోలీసింగ్' విధానానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. మండలంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగినా సహించేది లేదని, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎవరికీ తలొగ్గేది లేదని తేల్చి చెప్పారు. **వెల్లువెత్తిన శుభాకాంక్షలు:** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సీత పాండును పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హిందూ దేవాలయాల పరిరక్షణే లక్ష్యం

**• బీజేపీ ఎండోమెంట్ విభాగం తెలంగాణ**

**రాష్ట్ర కన్వీనర్ అన్నోజుల సూర్యప్రకాష్**



**తొలి అక్షరం/హైదరాబాద్, జూలై 06 :** హిందూ దేవాలయాల పరిరక్షణే లక్ష్యంగా, ధార్మిక చైతన్యం, సేవా కార్యక్రమాల విస్తరణకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ ఎండోమెంట్ విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అన్నోజుల సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎండోమెంట్ విభాగం కన్వీనర్ ఆర్.పోచాలు ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం బర్కత్ పుర లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఎండోమెంట్ విభాగానికి నూతనంగా నియమితులైన ప్రతినిధులను ఈ సందర్భంగా ఆయన ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. పార్టీ తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహిస్తామని వారు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎండోమెంట్ విభాగం ప్రతినిధులు నిరంజన్ దేశాయ్, తోట మల్లికార్జున్, బత్తుల రాజేశ్వర్ రావు, వి.నరేష్, సి.మహేందర్ ప్రసాద్, ఎస్.శివ, ఎన్. నీల గోపాల్, సి. మహేష్ కుమార్, సుదీర్ బాబు, ఆర్. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలన



**తొలి అక్షరం/సత్తుపల్లి, జులై 6 :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నెం 190, 194 లను సందర్శించి, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటైజేషన్ పనుల పురోగతిని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్ ప్రతి ఎన్యూమరేషన్ ఫారమ్‌లోని వివరాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని బూత్ లెవల్ అధికారులు కు సంబంధిత సిబ్బందికి సూచించారు. డిజిటైజేషన్ పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి, నిర్దేశించిన గడువులోగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. అలాగే, పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కారం చేయండి




**తొలి అక్షరం/పెనుబల్లి, జులై 6 :** మండల పరిధిలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వి.ఎం. బంజర్ నందు పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను స్థానిక హెచ్ఎం చిట్లూరి భాస్కర రావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఖమ్మం జిల్లా కోశాధికారి చలమాల విఠల్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం 15 వేల రూపాయలు ఇవ్వాలని, ఏప్రిల్, జూన్ పెండింగ్ బిల్లులను తక్షణమే రిలీజ్ చేయాలని, వంట పాత్రలో తక్కువ ఉన్న స్కూలుకు వంట పాత్రలో తక్షణమే అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు రాధా, గరిడేపల్లి లక్ష్మి, చావల నిలమ్మ, లక్ష్మి, తావు నాయక్ , వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ & గేమ్స్2026 వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు రెఫరీగా మండలోజు సుధాకర్



**తొలి అక్షరం/ఖమ్మం, జూలై 6 :** తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్2026లో నిర్వహించనున్న వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఖమ్మానికి చెందిన సేక్రెడ్ హార్ట్స్ ఈఎం స్కూల్ పీఈటీ శ్రీ మండలోజు సుధాకర్ రెఫరీగా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆయనను న్యాయనిర్ణేతగా నియమించింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జూలై 5 నుంచి కొనసాగుతున్న తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్2026లో భాగంగా జూలై 8 ఉదయం వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు చెందిన పురుషులు, మహిళా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. వెయిట్‌లిఫ్టింగ్ రంగంలో అనుభవం, సాంకేతిక నైపుణ్యాన్ని గుర్తించిన తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ శ్రీ మండలోజు సుధాకర్‌ను రెఫరీగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయనను సేక్రెడ్ హార్ట్స్ ఈఎం స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ స్టీఫీ, కరస్పాండెంట్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించి, పోటీల్లో విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# కళ్లు చెదిరే లైట్లు వేస్తే కఠిన చర్యలు

**- మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు**

**- ఒక్క రోజే 1,803 కేసులు నమోదు**

**- రూ. 2.84 లక్షల జరిమానా విధింపు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు) ,జూలై6:** రాత్రి వేళల్లో వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా హైబీమ్,మిరుమిట్లు గొలిపే అనాధికారిక లైట్లు అమర్చినా..అసలు హెడ్‌లైట్లు లేకుండా వాహనాలు నడిపినా ఇకపై సహించేది లేదని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. రోడ్డు భద్రతను మెరుగు పరచడం,మోటారు వాహనాల నిబంధనలను కఠినంగా అమలు చేయడంలో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మల్కాజ్‌గిరి కమిషనర్ బి.సుమతి ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు,డీసీపీలు కె.రాహుల్ రెడ్డి ఐపీఎస్, వి.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏసీపీలు,ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు,ట్రాఫిక్ సిబ్బంది ఈ విస్తృత తనిఖీల్లో పాల్గొన్నారు.

**ఒక్కరోజే భారీగా జరిమానాలు:**

ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించారు: నమోదైన కేసులు: 1,803 విధించిన మొత్తం జరిమానా: రూ.2,84,600. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, వాణిజ్య ప్రాంతాలు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాలు,రద్దీగా ఉండే ట్రాఫిక్ కారిడార్లలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ఈ తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు.




**ప్రమాదాలకు కారణమవుతున్న లైట్లు:**

రాత్రి వేళల్లో వాహనదారులు నిరంతరాయంగా హైబీమ్, మిరుమిట్లు గొలిపే లైట్లు వాడటం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారుల కళ్లు బైర్లు కమ్మి రోడ్డు సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే హెడ్‌లైట్లు లేకుండా నడపడం కూడా అంతే ప్రమాదకరం. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సరైన లైటింగ్ వ్యవస్థను నిర్వహించాలి. రహదారి క్రమశిక్షణను పెంపొందించడానికి ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి.

**-డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), మల్కాజ్‌గిరి కమిషనరేట్.**

Malkajgiri Police Commissionerate
Special Drive Cases on Without Headlight, Dazzling & High Beam light Dt: 06.07.2026

| S.No | Police station | High Beem/Dazzling/ W/o Head light | |
|---|---|---|---|
| | | Cases | Amount |
| 1 | Malkajgiri Tr PS | 89 | 14400 |
| 2 | Gopalpuram Tr PS | 148 | 24300 |
| 3 | Jawaharnagar Tr PS | 94 | 18700 |
| 4 | Trimulgherry Tr PS | 453 | 61400 |
| 5 | Alwal Tr PS | 204 | 36400 |
| 6 | Begumpet Tr PS | 186 | 33400 |
| Zone- I | | 1174 | 188600 |
| 1 | LB Nagar Tr PS | 184 | 27100 |
| 2 | Vanasthalipuram Tr PS | 159 | 23000 |
| 3 | Uppal Tr PS | 120 | 17000 |
| 4 | Kushaiguda Tr PS | 93 | 14500 |
| 5 | Ghatkesar Tr PS | 73 | 14400 |
| Zone- II | | 629 | 96000 |
| Total | | 1803 | 284600 |

Section:
Dazzling Light (R 432/177)
High Beam Light (106 CMVR/177)
Without head lights in night time (CR 105/177)

# ఖమ్మంలో సీఎం రేవంత్ సభకు రంగం సిద్ధం..

**• క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దివాకర్ టీఎస్**

**తొలి అక్షరం/ఖమ్మం, జూలై 6 :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురం (మత్కెపల్లి) వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి సభా వేదిక, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మిగిలిన ఏర్పాట్లను



త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 30న నిర్వహించాల్సిన రైతు భరోసా ప్రారంభ సభను భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల కారణంగా వాయిదా వేసిన విషయాన్ని గుర్తు చేశారు. జూలై 6 వరకు వర్షాలపై అప్రమత్తంగా పరిస్థితులను పరిశీలించిన అనంతరం ప్రస్తుతం సభా ప్రాంగణం పూర్తిగా ఎండిపోయి కార్యక్రమం నిర్వహించేందుకు అనుకూలంగా ఉందని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. ప్రాంగణ పరిస్థితులు, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటన తేదీని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ప్రకటిస్తుందని, తేదీ ఖరారైన వెంటనే ప్రజలకు సమాచారం అందిస్తామని చెప్పారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా బందోబస్తు వంటి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ యొక్క పరిశీలనాల్లో ఇంజినీరింగ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం

**• రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ • ఈద్గాఖబ్రస్తాన్ పరిరక్షణకు బచావో కమిటీ ఏర్పాటు**

**• రాజ్యాంగ పరిరక్షణ వేదిక అనుబంధంగా నూతన కమిటీ నియామకం**




**తొలి అక్షరం/ఖమ్మం, జూలై 6 :** ఐక్యతతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం అని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. ఖమ్మం నగరం గాంధీ చౌక్ ప్రాంతంలోని ఈద్గా వద్ద సోమవారం 'రాజ్యాంగ పరిరక్షణ వేదిక' ఆధ్వర్యంలో చారిత్రాత్మక ఈద్గా, ఖబ్రస్తాన్‌ల పరిరక్షణ కోసం 'ఈద్గా ఖబ్రస్తాన్ బచావో కమిటీ' ని నియమించారు. సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ, సుమారు 300 ఏళ్ల క్రితం నిజాం పాలనలో ఆసఫ్ జాహీ, కుతుబ్ షాహీ వారసుల కాలంలో ఈ చారిత్రక నిర్మాణాలు ఏర్పాటయ్యాయని, వాటి పరిరక్షణ ప్రతి ముస్లిం మైనారిటీ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఇటీవలి కాలంలో కొందరు ఆక్రమణదారులు ఈ స్థలాలపై కన్నేసి అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక చొరవ తీసుకుందని ఆయన తెలిపారు. మున్సిపల్ అధికారు లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో చర్చించి ఖబ్రస్తాన్‌ను శుభ్రపరచడం, ఈద్గా పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, చారిత్రక ప్రాధాన్యతకు భంగం కలగకుండా రూపురేఖలను సంరక్షించే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇకపై 'ఈద్గా ఖబ్రస్తాన్ బచావో కమిటీ' నిరంతరం ఈ ప్రాంతాల పర్యవేక్షణ చేపడుతుందని, మైనారిటీ సోదరుల అంత్యక్రియలకు అవసరమైన సహకారం అందించడంతో పాటు,



ఖననానికి అవసరమైన వస్త్రాలను కూడా ఉచితంగా ఈ కమిటీ ద్వారా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమం ముగింపులో సభ్యులు 'ఈద్గా బచావో ఖబ్రస్తాన్ బచావో', 'హమ్ సబ్ ఏక్ హై' నినాదాలతో ఐక్యతను చాటుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు సయ్యద్ సాదిక్ అలీ అభినందనలు తెలియజేసి, చారిత్రక వారసత్వ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలని నూతనంగా కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా షేక్ గౌస్, ఉపాధ్యక్షులుగా జహీర్, పెంటూ సాహెబ్, ఖాజా సాహెబ్, జబ్బర్ సాహెబ్, గౌస్ భాయ్, ఖాన్ సాబ్, షేక్ రహీం సాహెబ్, సయ్యద్ నజీర్, కరాటే మాస్టర్ ఖాసీం, షేక్ సుభాని సాహెబ్, సెక్రెటరీగా హాబీ భాయ్, జాయింట్ సెక్రటరీగా నాగుల్ మీరా, ట్రెజరర్ గా ఆరిఫ్ తదితరులను నియమించడం జరిగింది.